క్లుప్తంగా

కొలువుదీరిన పీర్లు



ప్రత్యేక అలంకరణలో పీర్ల స్వాములు

కొలిమిగుండ్ల: మొహర్రం పండుగను పురస్కరించుకొని తిమ్మనాయునిపేటలో పీర్లను గురువారం కొలువుదీరారు. ముజావర్లు, గ్రామ పెద్దల సమక్షంలో ముందుగా పీర్ల పెట్టెను మేళతాళాలతో ఊరేగింపు చేసి పీర్ల చావిడి వద్దకు చేర్చారు. పీర్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించి కొలువుదీర్చారు. 15న చిన్న సరిగెత్తు, 17న పెద్ద సరిగెత్తు, 18న పీర్ల నిమజ్జనం చేయనున్నారు. గ్రామంలో హిందు, ముస్లింలు కలిసికట్టుగా పండుగను చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలి

కోవెలకుంట్ల: లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని రిటైర్డ్ తెలుగు అధ్యాపకుడు రామాచార్యులు విద్యార్థులకు సూచించారు. గురువారం పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి అధ్యక్షతన పర్సనాల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు డిగ్రీ చదువు కీలకదశ అన్నారు. మంచి, చెడులను గుర్తించి మంచివైపు అడుగులు వేసి తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు కృష్ణశశాంక తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అవుకు: గ్రామ సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ మల్ రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రం అవుకు-3, అన్నవరం, గుండ్లశింగవరం గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి, ఆయా శాఖల సిబ్బందితో ఎంపీడీఓ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉద్యోగులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులపై, పంటల సాగుపై అవగాహన కల్పించాలని ఆయా శాఖల సిబ్బందికి సూచించారు.

మోడల్ స్కూల్ తనిఖీ

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ మోడల్ స్కూల్‌ను గురువారం ఎంఈఓ సోమశేఖర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి బోధన, విద్యార్థుల హాజరు, నాడు-నేడు పనుల పురోగతిపై చర్చించారు. విద్యార్థులతో మాట్లాడిన ఎంఈఓ వ్యక్తిత్వ వికాసంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రల పంపిణీ

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాబునాథ్ ఆధ్వర్యంలో గురువారం ఐరన్ మాత్రల పంపిణీ చేశారు ఈ సందర్భంగా వైఎస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు రక్తహీనత గురికాకుండా ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ కోర్డినేటర్ డాక్టర్ కే బడేసాహెబ్, అధ్యాపకులు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ కే రామకృష్ణ, వహిదా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడికి డాక్టరేట్



రాంబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్యాపిలి: జలదుర్గం గ్రామానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు, సీఆర్పీ మీనిగ రాంబాబుకు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హోసూరులో జరిగిన కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ రాంబాబును డాక్టరేట్‌తో సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకని గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ వెంకటేశ్ నాయక్, తోటి సీఆర్పీలు రాంబాబును ఘనంగా సన్మానించారు. సీఆర్పీలు రామాంజి, నవీన్, మద్దయ్య, ఉపాధ్యాయుడు రాజన్న తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి




కాలనీవాసులతో మాట్లాడుతున్న కమిషనర్

డోన్ టౌన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్య సమస్యలు తలెత్తవని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ అన్నారు. 24వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ సక్రమంగా చేపట్టడం లేదని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. పారిశుద్ధ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ సిబ్బందిని హెచ్చరించారు.

తల్లికి వందనం...ఎగనామం!

- మభ్యపెట్టే నైజాన్ని మరోమారు చాటుకున్న సీఎం చంద్రబాబు
- కుటుంబంలోని విద్యార్థులందరికీ రూ. 15 వేలు ఇస్తామన్న బాబు
- నేడు ఒక్కరికే అనేలా జీఓ జారీ
- ఆందోళన చెందుతున్న మహిళలు



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.

డోన్/కొలిమిగుండ్ల : టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయకుడు మభ్యపెట్టే నైజాన్ని మరోమారు చాటుకున్నారు. అధికారం చేజిక్కించుకోవడమే లక్ష్యంగా ప్రత్యేకించి మహిళలను మభ్యపెడుతూ ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన చంద్రబాబు నిబంధనలు అంటూ సంక్షేమ పథకాలకు కోతపెడుతన్నారనే విమర్శలు మొదలయ్యాయి. ఉచిత ఇసుక అంటూ మభ్యపెట్టేందుకు ప్రయత్నించిన టీడీపీ సర్కార్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఉచితం లేదు.. గిచితం లేదనే విమమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ జాబితాలో తల్లికి వందనం చేరింది. కుటుంబంలో చదువుకునే విద్యార్థులు ఎంతమంది ఉన్నా... ఒక్కొక్కరికి తల్లికి వందనం పథకం కింద రూ. రూ. 15వేలు చొప్పున అంజేస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ గుప్పించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం తల్లి/సంరక్షకుడికి పేరిట రూ. 15 వేలు అందజేసేలా ప్రభుత్వం జీవో జారీ చేయడంతో మహిళలు అయోమయానికి గురవుతున్నారు. జీఓ నంబర్ 29 ప్రకారం ఒక్కరికే వర్తిస్తుందని తల్లిదండ్రుల్లో చర్చ నడుస్తుంది. మళ్లీ మోసపోయామా? అనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తుంది. అదేవిధంగా నియమ నిబంధనలు మోపడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు మహిళలు. అర్హత ఉన్నందుకే కదా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మఒడి ఠంచన్‌గా అందజేసిందనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు కూడా.

పాఠశాలలు ప్రారంభమై నెల అవుతున్నా....

పాఠశాలలు పన:ప్రారంభమై నెల అవుతున్నా నేటికీ స్టూడెంట్ కిట్స్ సైతం సక్రమంగా విద్యార్థులకు అందలేదు. కొన్ని పాఠ్యపుస్తకాలు అందలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలలు తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక కిట్లు అందేవి. పుస్తకాలు, నోట్ పుస్తకాలు సక్రమంగా మొదటిరోజే ఇచ్చేవారు ఉపాధ్యాయులు. నేడు అందుకు విరుద్ధంగా మారింది. నెల అవుతున్నా తల్లికి వందనం నగదు అందజేయని టీడీపీ ప్రభుత్వం జీఓ జారీ చేసి మభ్యపెడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అందరికీ వర్తింప చేయాలి



మాకు ఇద్దరు పిల్లలు. నాభర్త ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుంటాడు. ఇద్దరిని నంద్యాలలో ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నా. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ.15వేలు ఇస్తామని వాగ్దానం చేశారు. ఇప్పుడేమో ఒకరికే వస్తుందని చర్చించుకుంటున్నారు. ఇద్దరికి కలిపి తల్లికి వందనం కింద రూ.30 వేలు వస్తుందని ఆశపడ్డాం. కొంత వరకైనా మేలు జరుగుతుందనుకున్నాం. ఇచ్చిన హామీ ప్రకారం విద్యార్థులందరికీ పథకాన్ని వర్తింప చేయాలి.

– రేణుకాదేవి,అబ్బులాపురం

తల్లికి వందనం ఒక్కరికే అంటే ఒప్పుకోం



చంద్రబాబు హామీలను నమ్మాం. తల్లికి వందనం పథకం కింద ప్రతివిద్యార్థి తల్లికి రూ. 15 వేలు ఇస్తామని ఎంతో నమ్మకంగా చంద్రబాబు చెప్పారు. తాము కూడా ఎంతో ఆశగా ఉన్నాం. అధికారం వచ్చాకా ఇప్పుడేమో ఒక్కరికే అంటే ఎలా... మేము ఒప్పుకోం. విద్యార్థులందరికీ వర్తింపజేయాల్సిందే.

-లక్ష్మిదేవి, వెంకటనాయునిపల్లి గ్రామం.

ప్రతి విద్యార్థికీ రూ. 15 వేలు ఇవ్వాల్సిందే



చంద్రబాబు హామీలను నమ్మాం. ఇప్పుడు మాటమార్చడం అన్యాయం. బాబు ఇచ్చిన హామీ మేరకు ప్రతివిద్యార్థికి రూ. 15 వేలు ఇవ్వాల్సిందే. ఇప్పటికే పరమేశ్వరయ్య, రాధాక్రిష్ణ అనే మా ఇద్దరు పిల్లలను చైతన్య స్కూల్‌లో 4, 6 తరగతుల్లో చేర్పించాం. రూ.40వేలు ఫీజును అప్పులు చేసి చెల్లించాం. ఇప్పుడు ప్రభుత్వం మాటమార్చితే మా పరిస్థితి ఏమిటి. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ. 30 వేలు తల్లి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని ఆశిస్తున్నాం.

– మంజుల, ఉడుములపాడు గ్రామం.

ఆశ.. నిరాశేనా....



నా పేరు పావని. నాకు ఇద్దరు పిల్లలు. అవుకు గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా నా ఇద్దరు పిల్లలకు నగదు వస్తుందని ఆశించా. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలవుతున్నా పథకం ఊసే లేదు. ఫీజులు ఎక్కువైనా తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందనే నమ్మకంతో నా ఇద్దరు పిల్లల్ని ప్రైవేటు పాఠశాలలోనే చేర్పించా. నా ఆశ... నిరాశగా మారేలా ఉంది. ఇంత అన్యాయం ఏ మాత్రం మంచిదికాదు.

– పావని, అవుకు గ్రామం.

మాట మార్చడం సమంజసం కాదు....



సీఎం వైఎస్ జగన్ పాలనలో ఉన్న అమ్మఒడి పథకాన్ని నేడు చంద్రబాబు పాలనలో తల్లికి వందనం పథకంగా మార్పు చేశారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు ఈ పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఏ మాత్రం మాటమార్చకుండా వెంటనే అమలు చేయాలి. మాది వ్యవసాయ పేద కుటుంబం. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బనగానపల్లెలో ప్రైవేట్ పాఠశాలల్లో 6, 4వ తరగతి చదువుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హామీ మేరకు మాకు ఇద్దరి పిల్లలకు కలిపి రూ.30వేలు రావాల్సి ఉంది.

– రేణుక, బత్తులూరుపాడు, బనగానపల్లె

ఇచ్చిన హామీని అమలు చేయాలి



నాకు ముగ్గురు పిల్లలు. కుమార్తె 10వ తరగతి. ఇద్దరు అబ్బాయిలు 8,9 తరగతి చదువుతున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్ర బాబు నాయుడు చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి. ఇప్పుడు ఒక్కరికే అంటే పిల్లలు చదువులు భారంగా మారే అవకాశం ఉంది. మాట మార్చడం మంచిపద్ధతి కాదు.

– రజియా బేగం, ఆర్ ఎస్ రంగాపురం, బేతంచెర్ల మండలం

దోషులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



రాస్తారోకో చేస్తున్న దృశ్యం



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: పగిద్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం,హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ గోపాల్ డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ గురువారం కొలిమిగుండ్లలో ఆ సంఘం నాయకులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టి సీఐ గోపీనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు పెద్దయ్య, సుధాకర్, రమణ, రామ్మూర్తి, వెంకట్రాముడు, నరసింహుడు, హరి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్ : మైనర్ బాలికను అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన ముగ్గురు నిందితులను కఠినం శిక్షించాలని ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు కాలింగిరి రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముగ్గురి నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు.

డోన్ టౌన్ : మైనర్ బాలికను అత్యాచారం, హత్య చేసిన మానవ మృగాలను ఉరి తీయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. సంఘటనను నిరసిస్తూ గురువారం పట్టణంలో రాస్త రోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శులు అశోక్, నక్కి హరి, నాయకులు హబీబ్‌బాషా, రాజేష్, పవన్, రామలింగం, శ్రీనివాసులు, రాజశేఖర్, విజయ్, జితేంద్ర పాల్గొన్నారు.

ప్యాపిలి: మైనర్ బాలికను హత్యాచారం చేసిన నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని వాల్మీకి సంఘం నాయకులు, పట్టణ యువకులు హనుమప్ప, బంగి నాగరాజు, కిష్టిపాడు చంద్ర, పూజారి శివకిశోర్ డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ గురువారం పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ వద్ద వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, మధు, నాగరాజు, ప్రతాప్, రామాంజి పాల్గొన్నారు.

డోన్ రూరల్ : మైనర్ బాలికను అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు షమీమ్‌బేగం, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ, సహాయ కార్యదర్శి వరదరాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పాతబస్టాండ్ గాంధీ సర్కిల్ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో షభాన, పద్మా, మాధవి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం

డోన్ : ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువులు, సరుకులు, కూరగాయల ధరలను తగ్గించేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందనిఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే కోట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందిపప్పు కిలో రూ.160, కిలో బియ్యం రూ.49 చొప్పున అందజేస్తారన్నారు. కందిపప్పు కిలో, బియ్యం 5 కిలోల చొప్పున ప్రతి రేషన్‌కార్డుదారునికి కేంద్రం ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ మాధవక్రిష్ణారెడ్డి, జాతీయ బీసీ సంఘం కార్యదర్శి నాగేశ్వరరావ్‌యాదవ్, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడ్, మాజీ సర్పంచ్ పెద్దకేశవయ్యగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడ్, మాజీ జెడ్పీటీసీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడే చట్టాలను రద్దు చేయాలి

బేతంచెర్ల: డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడే చట్టాలను రద్దు చేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా జనరల్ బాడీ సమావేశం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, బేతంచెర్ల యూనియన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ బోర్డును ప్రతి రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 1నుంచి ప్రవేశ పెట్టిన వాహన చట్టాలను రద్దు చేయాలన్నారు.



మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్

బాల్య వివాహాలు నేరం

డోన్ రూరల్ : బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ శంసాద్‌బేగం తెలిపారు. మండల పరిధిలోని దొరపల్లిలో గురువారం బాల్య వివాహాల నష్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు మూలంగా మాతా, శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా నేరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చెన్నకేశవులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పరమేశ్వరి, తిప్పమ్మ, శోభరాణి, అనురాధ, శకుంతల, దేవకృప, ఈశ్వరమ్మ, స్వేతకీర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ప్యాపిలి: స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ కేసుల గురించి సీఐ సుధాకర్‌రెడ్డినిఅడిగి తెలుసుకున్న డీఎస్పీ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొహర్రం వేడుకల సందర్భంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణ సబ్ స్టేషన్ టౌన్ ఫీడర్ కింద నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల కారణంగా ఇందిరానగర్, ప్రజావైద్యశాల, నారాయణ స్కూల్, తారకరామనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్యాపిలి: ప్యాపిలి సబ్‌స్టేషన్ పరిధిలోని వెంగళాంపల్లి, వెంకటాంపల్లి, ఎస్ రంగాపురం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఏఈ వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంగళాంపల్లి ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఆయా గ్రామాలకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్మికులకు అండగా ఎంప్లాయీస్ యూనియన్

డోన్ టౌన్ : కార్మికులకు ఎంప్లాయీస్ యూనియన్ అండగా ఉంటుందని, వారి నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉందని ఆ సంఘం డిపో అధ్యక్షుడు మౌలాలి అన్నారు. ఈయు 73వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో అధికారి అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, సోమన్న, చాంద్‌బాషా, రెడ్డి, పెద్దరాజులు, నారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీకి విద్యార్థినుల ఎంపిక



గుణామృత



సమీర



గీతారాణి



అమృత



ధరణి లక్ష్మి

కోవెలకుంట్ల: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం అరుణ కుమారి తెలిపారు. పదిలో గుణామృత 581 మార్కులు, సమీర 575, గీతారాణి 574 సాధించారన్నారు. విద్యార్థినులను ఉపాధ్యాయినీలు ప్రత్యేకంగా అభినందించారు.

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామానికి చెందిన బంటుపల్లి నారాయణ, నారాయణమ్మల కుమార్తె అమృత ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పీఆర్ పల్లి ఉన్నత పాఠశాలలో చదివిన అమృత పదో తరగతిలో 567 మార్కులు సాధించింది. గురువారం విడుదలైన ట్రిపుల్ ఐటీ జాబితాలో అమృత ఎంపికైనట్లు ఎంఈఓ వెంకటేష్ నాయక్ తెలిపారు.

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన ధరణి లక్ష్మి ఐఐఐటీకి ఎంపికైంది. జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన ధరణిలక్ష్మి పదవ తరగతిలో 570 మార్కులు సాధించి ఇడుపులపాయ కళాశాలలో సీటు సాధించింది. విద్యార్థినిని ఉపాధ్యాయులు,తల్లితండ్రులు అభినందించారు.

పిల్లల శ్రేయస్సుకు జాగ్రత్తలు పాటించాలి

బనగానపల్లె రూరల్ : పిల్లల శ్రేయస్సు కోసం తల్లులు వెనువెంటనే గర్భందాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కుటుంబ ప్రణాళిక ఏర్పాటు చేసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. గర్భనిరోధక మాత్రలు, ఐయుసీడీ అంతర ఇంజక్షన్లు పాటించడం తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఎస్ వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్,ఏఎన్ఎం గ్రేసమ్మ, ఆశావర్కర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం, సిమెంట్ నగర్‌లో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణ ప్రయోజనాలను ఈ సందర్భంగా వైద్యులు అలీం, హెహతాబ్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ అబ్దుల్ గఫార్, సూపర్ వైజర్లు రాజ్యలక్ష్మి, రూతమ్మ, ఇక్బాల్ ,సర్వేష్ హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, రాజేశ్వరి బాయి, సువర్ణలక్ష్మి, ఫరిదాభాను, వరలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె శివాలయం సమీపంలో గురువారం అల్ట్రాటెక్ సిమెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని కంపెనీకి చెందిన వసుంధర లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ మీనాక్షి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. మొదటి బ్యాచ్‌లో 30 మందికి మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. కుట్టు మిషన్‌కు చెందిన కిట్లను మహిళలకు అందజేశారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మీనాక్షి

చిరుధాన్యాలు ఆరోగ్యకరం

బనగానపల్లె : చిరుధాన్యాల ఆహార పదార్థాలు ఆరోగ్యకరమని కేవీకే సీనియర్ శాస్త్రవేత ధనలక్ష్మీ తెలిపారు. మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కేజీఆర్ కాంప్లెక్స్‌లో చిరుధాన్యాల ఆహార పదార్థాల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో జొన్న రాగి, కొర్ర, అరక, వరిగ, సజ్జతో తయారు చేసిన ఇడ్లీ, దోశ, ఉతప్పం, పొంగలి పూరి, వడా, పులిహోర, పెరగన్నం , రొట్టెలు, సంగటి రాగి జావా తదితర ఆహార ప్రదార్థాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు బాలరాజు, రమణయ్య, లక్ష్మీప్రియ, ఏఓ సురేష్, యాగంటిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోండి

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపాన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం 4. 08 ఎకరాలను కేటాయించిందని ప్రిన్సిపాల్ రాజేష్ గురువారం తెలిపారు. అయితే సర్వే నంబర్ 547-1ఏ3లోని 3.28 ఎకరాలకు సంబంధించి భూమిని కొందరు చదును చేస్తున్నారనే సమాచారం మేరకు అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ పరిశీలించారు. స్థలం చదును చేసి వుండడంతో ప్రిన్సిపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెల 8న పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించామన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో టెండరింగ్ ప్రక్రియ ఆలస్యం అయ్యిందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించిన స్థలం రికార్డులను 2023 అక్టోబర్‌లో రెవెన్యూ అధికారులు మాకు అప్పగించారని తెలిపారు. కళాశాలకు కేటాయించిన స్థలంను అక్రమించడం చట్టరీత్యా నేరమని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భూ ఆక్రమణపై పోలీస్ స్టేషన్, రెవెన్యూ అధికారులతో పాటు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రిన్సిపాల్ రాజేష్ తెలిపారు.

ఆడపిల్లలను చదివించాలి

సంజామల: ఆడ పిల్లలను చదివించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సంజామల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. మండల పరిధిలోని నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బేటీ పడావో బేటీ పచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు లింగ వివక్ష చూపకుండా ఆడపిల్లలను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

బనగానపల్లె రూరల్ : బనగానపల్లెలోని భానుముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యుడుగా ఉంటూ మృతి చెందిన వడిశేల బ్రహ్మనందరెడ్డికి సంబంధించిన బీమా చెక్కును గురువారం బనగానపల్లె కేడీసీసీ బ్యాంకు చీఫ్‌మేనేజర్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ ర్రీ ప్రియాంక చేతుల మీదుగా మృతుడి భార్య వడిశేలలక్ష్మీప్రసన్నకు అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శత్రుఘ్నుడు, సీఈఓ అబ్దుల్ మునాఫ్, ఏఈఓ జీఎండీ షామీర్ పాల్గొన్నారు.

తూనికలు,కొలతల అధికారి తనిఖీలు

డోన్ టౌన్ : పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్, స్వాతి ఎలక్రికల్స్, సాయిరాం గ్లాస్ అండ్ ప్లేవుడ్ దుకాణాలలో గురువారం తూనికలు కొలతల శాఖ అధికారి ఖాజా హుస్సేన్ తనిఖీలు నిర్వహించారు. మోర్ సూపర్ మార్కెట్‌లో బియ్యం, కంది పప్పు ధరలు డిస్‌ప్లే చేయకుండా విక్రయిస్తుండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పైలా దాసుపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్ : దేవతామూర్తులు, బ్రాహ్మణులను కించపరిచే విధంగా మాట్లాడుతున్న పైలాదాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొవాలని డోన్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కళ్లే శేషావలి శర్మ, నాయకులు శంకరశర్మ, గంగాధరశాస్త్రీ, సుబ్రహ్మణ్యశర్మ, శేషశయనరావు, చలపతిరావు,శ్రీనివాస్, ఏవీ రావు, చంద్రశేఖర్ శర్మ, ప్రహ్లాదశర్మ, భాస్కరశర్మ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని జగదుర్తి గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. బెంగళూరు నుంచి గద్వాలకు వెళ్తున్న బొలెరో వాహన్ని వెనుక నుంచి ఓవర్ టెక్ చేస్తూ ట్రావెల్ బస్సు ఢీ కొంది. బొలెరో వాహనంలోని కిష్టన్న, శంకరప్ప, రవికి గాయాలయ్యాయని చెప్పారు. కిష్టన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

హమాలీ కుటుంబానికి ఆర్థిక సాయం

డోన్ టౌన్ : ఇటీవల మృతి చెందిన హమాలీ జంబన్న కుటుంబానికి మండి ఓనర్ల సంఘం తరుపున రూ. 35 వేలు అందజేశారు. పట్టణ సమీపానున్న కోట్ల విజ యభాస్కర్‌రెడ్డి కూరగాయల మార్కెట్‌లో నగదును బాధిత కుటుంబ సభ్యులకు నాయకులు అందజేశారు.